క్లుప్తంగా

కొమ్ము రాజేందర్ క్రీడాకారులకు ఆదర్శం



నెక్కొండ : పారిస్ వేదికగా జరగనున్న పారా ఒలింపిక్స్ టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించనున్న కొమ్ము రాజేందర్ క్రీడాకారులకు ఆదర్శమని శ్రీ యాదవ సంఘం నాయకుడు దేవనబోయిన వీరభద్రం అన్నారు. రాజేందర్ పారిస్‌కు వెళ్లనున్న క్రమంలో మండల కేంద్రంలో ఆదివారం ఆయనను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడారు. రాజేందర్ క్రీడలను నమ్ముకొని అకుంఠిత దీక్ష, పట్టుదలతో శ్రమించి ఉన్నత స్థానానికి ఎదిగారని తెలిపారు. పారా ఒలింపిక్స్‌లో టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించనుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజేందర్ స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బండారి రాజేశ్, లెంకలపెల్లి కుమార్, దొంగల అశోక్, రాపాక విజేందర్, గుండ్రకోటి దిలీప్, బొమ్మరబోయిన రాజేశ్, రేగుల అశోక్, కొట్టం దేవేందర్, పనికర సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన తారాచంద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కొత్తూరుతండా ఎంప్లాయిస్ యూనియన్ ఆదివారం రూ.13 వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం సాయంగా అందించింది. తొలుత బాధ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు జీవన్, ఫకీర, శ్రీనివాస్, రాజ్‌కుమార్, భద్రు, స్వామి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూరు : ఇటీవల రుణమాఫీ పొందిన రైతులు మరల పంటరుణాల పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, సీఈఓ ఓమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పంటరుణం కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, 1బీ పహణీ జిరాక్స్, పట్టాపాస్‌బుక్కు జిరాక్స్, ఈసీ కాపీతో ఆత్మకూరు పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

72 యూనిట్లు.. రూ.2,002 బిల్లు

ఐనవోలు : విద్యుత్‌శాఖ అధికారులు ఇష్టానుసారంగా బిల్లులు వేసి వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు మేరుగు సురేశ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తన ఇంటికి యూఎస్‌సీ నంబర్ 1617201 గల విద్యుత్ మీటర్ ఉందని తెలిపారు. జూన్ 8 నుంచి జూలై 6 వరకు బిల్లు తీశారని, 304 యూనిట్ల విద్యుత్ వినియోగించినట్లు రాగా రూ.1,999 బిల్లు వచ్చిందన్నారు. అన్ని యూనిట్ల విద్యుత్ వినియోగించలేదని విద్యుత్ అధికారులకు తెలుపగా మీటర్ స్ట్రక్ అయిందని, గత నెల యావరేజ్‌ను బట్టి బిల్లు నిర్ధారణ జరిగిందని, రూ.1,999 కట్టక తప్పదని చెప్పినట్లు పేర్కొన్నాడు. తర్వాత విద్యుత్ అధికారులు కొత్త మీటర్‌ను బిగించారని తెలిపాడు. అయితే జూలై 6 నుంచి ఆగస్టు 4 వరకు ఆదివారం బిల్ తీయగా ఆ మీటర్ రీడింగ్ కేవలం 72 యూనిట్లు వాడినట్లుగా చూపిస్తుందన్నారు. అయినప్పటికీ మళ్లీ బిల్ మాత్రం యావరేజ్ 304 యూనిట్లకు రూ.2,002 వేశారని వాపోయాడు. మళ్లీ అధికారులకు తెలుపగా బిల్లు కట్టాల్సిందేనని దబాయించారని తెలపాడు. ఏఈ పద్మను వివరణ కోరగా వినియోగదారుడు సమస్యను తన దృష్టికి తీసుకుచ్చారని, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని చెప్పారు.

10, 11 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో ఈనెల 10, 11వ తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ కరీమాబాద్‌లో సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అధ్యక్షతన ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాయని, బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించాయని విమర్శించారు. విద్యావ్యవస్థను కార్పొరేట్, ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే విధానాలను అవలంబిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రాకేష్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో కేజీబీవీ

- పని చేయని ఆర్ఓ ప్లాంట్, సీసీ కెమెరాలు

సంగెం : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. విద్యాలయంలో అనేక సమస్యలు ఏళ్ల తరబడిగా అపరిష్కృతంగా ఉంటున్న దుస్థితి నెలకొంది. సమస్యల నడుమనే విద్యార్థినులు చదువుకుంటున్నారు. విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 200 మంది కాగా ఇంటర్మీడియెట్‌లో 100 మంది ఉన్నారు. మొత్తం 300 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. విద్యాలయంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాల్లేవని విద్యార్థినుల తల్లిదండ్రులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన సమస్యలు ఇవే..

విద్యాలయంలోని ఆర్ఓ ప్లాంట్ పని చేయడం లేదు. దీంతో విద్యార్థినులు బోరు నీటినే తాగుతున్న పరిస్థితి నెలకొంది. వర్షాకాలం నేపథ్యంలో అనారోగ్యం బారిన పడితే ఎలా అని విద్యార్థినులు వేదనకు గురౌతున్నారు. వంట గదితోపాటు తరగతి గదుల తలుపులు, కిటికీలు పాడైపోయాయి. కిటికీలకు జాలీలు లేకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఈ కారణంగా విద్యార్థినులు జ్వరాల బారిన పడుతున్నారు. విద్యార్థినుల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సైతం చెడిపోయాయి. వంట గది, వాష్‌రూముల ఏరియాలోని బండలు పాడైపోయాయి. స్లాబ్ లీకేజీతో గుర్రై వర్షానికి కురుస్తున్నది. బాలికల స్నానానికి అవసరమైన వేడి నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్ సైతం పని చేయడం లేదు. నల్లాలు సైతం మరమ్మతుకు గురయ్యాయి. డ్రైనేజీ సరిగా లేక మురుగునీరు బయటకు వెళ్లని పరిస్థితిలో దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థినులు తెలిపారు. కోతుల నివారణ కోసం ప్రహరీకి సోలార్ ఫెన్సింగ్, సంప్ రిపేరు తదితరాల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇంటర్ విద్యార్థినుల కోసం అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యాలయంలో నెలకొన్న అన్ని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



అధికారులు స్పందించాలి



విద్యాలయంలో అనేక సమస్యలతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఆర్ఓ ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్, సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించడంతోపాటు డ్రైనేజీ, తదితర సమస్యలను పరిష్కరించాలి. విద్యార్థినులు జ్వరాల బారిన పడుతున్నారు. తరచూ ఇంటికి తీసుకెళితే చదువుల్లో వెనుకబడే ప్రమాదం ఉంది.

-దప్పు వెంకన్న, పేరెంట్

ఉన్నతాధికారులకు నివేదించాం



విద్యాలయంలో సమస్యలున్న విషయం వాస్తవమే. వాటి పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు మండల ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటుగా జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాము. పరకాల ఎమ్మెల్యే సహకారం కూడా కోరాము. సమస్యలను ఆయనకు వివరించాము. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలో సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నాం.

-నీలిమ, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి, సంగెం

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే



నర్సంపేట : ఫ్రెండ్‌షిప్ బాండ్‌తో భారతి, అంగన్‌వాడీ టీచర్లు

నర్సంపేట : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. అంగన్‌వాడీ టీచర్లు ఫ్రెండ్‌షిప్ డే బాండ్‌లు కట్టుకుని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి మాట్లాడారు. స్నేహానికి కుల, మత, ప్రాంత, ఇతర భేదాల్లేవని చెప్పారు. స్నేహాన్ని వెలకట్టలేని అపూర్వ సంపదగా అభివర్ణించారు. డబ్బుతో చేయలేని అనేక పనులు స్నేహం ద్వారా పూర్తి చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు గొర్రె రాధ, బత్తిని శిరీష, మండల కార్యదర్శి డి.రమాదేవి, సెక్టార్ లీడర్లు గౌసియా, ఉమాదేవి, సరోజన, వాణి, ఉమాకళ, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని గ్రామాల్లో స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, యువత, చిన్నారులు చేతులకు ఫ్రెండ్‌షిప్ బాండ్ కట్టుకుని సందడి చేశారు.



చెన్నారావుపేటలో..

సిద్దార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు ఫ్రెండ్‌షిప్ బాండ్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు

‘పెద్ది’ చొరవతోనే మెడికల్ కాలేజీ

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

నల్లబెల్లి : గతంలో ఎమ్మెల్యేగా పెద్ది సుదర్శన్‌రెడ్డి తీసుకున్న చొరవ ఫలితంగానే నర్సంపేట నియోజకవర్గానికి ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి తెలిపారు. త్వరలోనే తరగతులు ప్రారంభం కానున్నాయని ఆయన అన్నారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, ప్రయాణికులకు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడారు. ఎమ్మెల్యేగా పెద్ది సుదర్శన్‌రెడ్డి గతంలో నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ఎనలేని కృషి చేశాడని తెలిపారు. నర్సంపేటకు మెడికల్ కళాశాల తీసుకురావడానికి సుదర్శన్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, నాయకులు గండె శ్రీనివాస్ గుప్తా, మామిండ్ల మోహన్‌రెడ్డి, నానబోయిన రాజారాం, క్యాతం శ్రీనివాస్, భూక్య బాలరాజు, మేర్గు చందర్, కొండొజు వెంకన్న, బొట్ల పవన్, బట్టు సాంబయ్య, గోనెల నరహరి, గుండాల కుమారస్వామి, వైనాల వీరస్వామి, ఒడెల రవి, పాడేటి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి స్వీటు తినిపిస్తున్న సారంగపాణి

కుక్, అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

సంగెం : మండలంలోని మోడల్ స్కూల్‌లోని బాలికల వసతిగృహంలో తాత్కాలిక ప్రాతిపదికన హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టుల కోసం అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయడానికి గడువు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. హెడ్ కుక్ పోస్టుకు 10వ, అసిస్టెంట్ కుక్ పోస్టుకు 7వ తరగతి చదివిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అర్హులు ఈనెల 6న సాయంత్రం 4 గంటల వరకు గవిచర్లలోని మోడల్ స్కూల్ బాలికల వసతిగృహంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ఐనవోలు : అన్నదమ్ములు ఇద్దరూ కానిస్టేబుల్లే.. వేర్వేరు చోట్ల విధులు నిర్వర్తిస్తున్న వారి మధ్య భూవివాదం తలెత్తింది. దీంతో తమ్ముడిపై అన్నయ్య ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అమరవాది రమేశ్, అమరవాది కుమారస్వామి అన్నదమ్ములు. వీరిద్దరూ కానిస్టేబుల్స్‌గా వేర్వేరు చోట్ల విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామంలో వీరికున్న భూమి పంపకాలు చేసుకుని హద్దులు వేసుకుని బాటను కూడా ఏర్పాటు చేసుకున్నారు. కాగా కుమారస్వామి అప్పుడు కేటాయించిన బాటకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకుని స్థలం కబ్జా చేశాడని ఆరోపిస్తూ రమేశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నెక్కొండ : మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్‌లో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 31 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట రెండోసారి కలుసుకుని సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా ఆనందడోలికల్లో తేలియాడారు. బాల్యంలో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుని ఆత్మీయత పంచుకున్నారు. ప్రాణం ఉన్నంత వరకు స్నేహం కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ఆపద సమయాల్లో ఒకరికొకరు తోడుగా, నీడగా నిలవాలని నిశ్చయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు వంగాల సత్యనారాయణ, తాళ్లపెల్లి చెన్నకేశవులు, రాపాక వెంకటేశ్వర్లు, రామోజు రాము, గడ్డం శ్రీనివాస్, కొయ్యడి ప్రశాంత్, కొంకాల సతీశ్, తోకల కుమార్, మహ్మద్ అఫ్జల్, హైదర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేద కుటుంబాలకు సాయం

తొర్రూరు : సీఎంఆర్ఎఫ్‌తో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల లబ్ధిదారులకు రూ.76.49లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరి ఆర్థిక ఇబ్బందులు పడిన పేదలకు ప్రభుత్వం తరఫున ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ కృష్ణమాచార్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, మండలాల అధ్యక్షులు సుంచు సంతోష్, రవీందర్‌రెడ్డి, ముద్దసాని సురేష్, నాయకులు చిత్తలూరి శ్రీనివాస్, మేకల కుమార్, కందాడి అశోక్‌రెడ్డి, జాటోతు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వర్సిటీల్లో రిజర్వేషన్ కల్పించండి



నిరసన తెలుపుతున్న కుమారస్వామి, నాయకులు

వర్ధన్నపేట : ప్రైవేట్ యూనివర్సిటీల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ, తదితర వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను 40 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ లభించినా బడుగులకు, అర్హులకు ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు అమలు చేయడం లేదని చెప్పారు. బడుగుల ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్ ఆధారంగా చదువుకునే, ఉద్యోగం చేసే అవకాశాలు కోల్పోతున్నాయని తెలిపారు. రిజర్వేషన్లు కల్పించని యూనివర్సిటీలకు ప్రభుత్వం అనుమతి ఎలా ఇస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో ప్రైవేట్ యూనివర్సిటీల్లోనూ అక్కడి ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయని తెలిపారు. తెలంగాణలోనూ రిజర్వేషన్ అమలు చేసి బడుగుల , బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిగాల అరుణ్, చల్లా మిథున్, సీనపెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయండి

తొర్రూరు: జిల్లా విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. ఈనెల 7న ఉపాధ్యాయ సమస్యలపై కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కరపత్రాలను ఆదివారం డివిజన్ కేంద్రంలో యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఖానాపురం : ఈనెల 9న నర్సంపేట పట్టణంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గొంది నాగేశ్వర్‌రావు కోరారు. మండలంలోని మంగళవారిపేట గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. జిల్లా పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకోసం రాజ్యాంగయుతంగా చట్టం చేయాలని ఆకాంక్షించారు. ఆదివాసీల సంరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. సంస్కృతి, సాంప్రదాయాలతోపాటు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆదివాసీ గిరిజనులపైనే ఉందని స్పష్టం చేశారు. ఆదివాసీ దినోత్సవానికి డివిజన్‌లోని ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, నర్సయ్య, వెంకన్న, ఉపేందర్, శ్రీకాంత్, చిరంజీవి, శ్రీను, వేణు, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాటం

ఐనవోలు : ప్రధానంగా భావించే ఐదు సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేసేందుకు సీపీఎం శ్రేణులకు మూడురోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 7వ తేదీ వరకు జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను కాజీపేటలోని ఫీఎఫ్ ఆఫీస్ సమీపంలోని కనకదుర్గ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించేందుకు ఈ క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా పాలన కొనసాగిస్తుందని, మతతత్వ విధానాలను తీవ్రతరం చేస్తూ మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. తరగతులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, అబ్బాస్‌తోపాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతారని లింగయ్య వెల్లడించారు.

పాఠశాలలో.. చినుకు పడితే చిత్తడే



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

- క్రీడా మైదానం బురదమయం

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చినుకు పడితే చిత్తడే... అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణ బురదమయం అయ్యింది. అసలే వర్షాకాలం. ఆపై వర్షపు నీరు నిల్వడంతో అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు బురదలో నుంచే నడిచి తరగతులకు హాజరై తిరిగి ఇంటికి చేరుతున్న పరిస్థితిలో వారు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే గ్రౌండ్ లెవలింగ్ చేయించి నీరు నిల్వ లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలవడం, ఇతర సమస్యల పరిష్కారానికి అధికారుల అనుమతితో చర్యలు చేపడతాం. వర్షాకాలం పాఠశాల ఆవరణలోని మైదానం చిత్తడిగా మారుతోంది. ఎండిన చెట్ల సమస్యనూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అవసరమైన పనులు చేపడతాం.

-లడె రవీందర్, హెచ్‌ఎం

వర్షాకాలం పరిసరాల శుభ్రత కీలకం



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీఓ

రాయపర్తి : సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో వర్షాకాలంలో పరిసరాల శుభ్రత కీలకమని ఎంపీఓ కూచన ప్రకాశ్ చెప్పారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆదివారం ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలోని ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. పిచ్చిమొక్కలను, గడ్డిని తొలగించాలని సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నేటి (సోమవారం) నుంచి ఈనెల 9 వరకు చేపట్టనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్, కారోబార్ రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతోనే నేరాల నివారణ



మాట్లాడుతున్న సీఐ చంద్రమోహన్

చెన్నారావుపేట : ప్రజలు చైతన్యవంతమై నేరాల నివారణకు తోడ్పాటు అందించాలని సీఐ చంద్రమోహన్ ఆకాంక్షించారు. మండలంలోని ఉప్పరపల్లిలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, గుట్కా, మద్యం, సైబర్ నేరాలు, తదితరాలపై ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మెరుగైన సమాజ నిర్మాణంలో యువత కీలకమని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని చెప్పారు. మత్తు పదార్థాల విని యోగం, విక్రయం వివరాలను పోలీసులకు అందించి సహకరించాలని చెప్పారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పేకాట, అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు అందించి నేరాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గూడ అరుణ్, కళాబృందం సభ్యులు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.